పచ్చని ఇంట అప్పుల చిచ్చు

పెద్దదిక్కును కోల్పోయి ఆగమైన కుటుంబం ● ఇంటిదిక్కు ముఖం చూపెట్టని అధికారులు ● భారంగా బతుకెళ్ల దీస్తున్న తల్లి, భార్యాపిల్లలు

సకాలంలో భరోసా ఇవ్వని కాంగ్రెస్ సర్కారు ● కేసీఆర్ తెచ్చిన రైతుబీమాతోనే కొంత ఊరట ● రైతు పిట్టల సుధాకర్ కుటుంబం దీనగాథ

వరంగల్ జిల్లాకు నేడు బీఆర్ఎస్ కమిటీ ● సంగెంలో కమిటీ సభ్యుల అధ్యయనం ● బాధిత కుటుంబాలను పరామర్శించనున్న హరీశ్

హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచరలో సుధాకర్ కుటుంబం సాగు చేస్తున్న మక్క పంట

వరంగల్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): ఇంటి ముందు కూర్చుని దీనంగా చూస్తున్న వీరు హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచరకు చెందిన రైతు పిట్టల సుధాకర్ కుటుంబ సభ్యులు. 2024 మార్చి 9న పిట్టల సుధాకర్(43) పురుగుల మందు తాగి ప్రాణం తీసుకున్నాడు. సుధాకర్‌కు భార్య విజయ, కొడుకు రాహుల్, కూతురు రవళి తల్లి వెంకటమ్మ ఉన్నారు. కుటుంబానికి ఊరిలోనే మూడెకరాల భూమి ఉన్నది. గతంలో ఉన్నంతలో బ్రతికేవారు. సుధాకర్ ఆధునిక పంటలు పండించుకుని ఆర్థికంగా ఎగగాలనే ఉద్దేశంతో అప్పులు తెచ్చి బావి తవ్వించాడు. నీటి ఊటలు తక్కువగా ఉండటంతో మరి కొంత అప్పు చేసి సైడుబోర్లు వేశాడు. ఇదే తరుణంలో కూతురు రవళి పెండ్లి కోసం మరింత అప్పు చేశాడు. ఆ తర్వాత పరిణామాలలో తెచ్చిన అప్పులకు మిత్తీలు పెరిగిపోయాయి. సాగునీరు లేక పంటల దిగుబడి సరిగా రాలేదు. అప్పుల భారం మోయలేనంతగా పెరిగింది. సుధాకర్ చనిపోయే నాటికి మొత్తం అప్పు రూ.15 లక్షలకు చేరుకుంది. అప్పులవాళ్ల నుంచి ఒత్తిడి పెరిగింది. అప్పు విషయంలో కొందరు పరుషపదజాలంతో నిలదీయడంతో నిరాశకు గురైన సుధాకర్ వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ టైమ్‌లో కనీసం అంత్యక్రియల ఖర్చు కూడా భరించలేని స్థితిలో వారి కుటుంబం ఉన్నది. బంధుమిత్రుల సాయంతో అంత్యక్రియల తంతు ముగిసింది. సాంకేతిక కారణాలతో సుధాకర్ కుటుంబానికి రైతు బీమా పథకం అందలేదు. 2024 ఏప్రిల్ 5న 'నమస్తే తెలంగాణ' పత్రిక 'అప్పులు భారమై–పంటలు దూరమై'అనే శీర్షికన కథనాన్ని ప్రచురించింది. అధికారులు సుధాకర్ ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బీమా కింద రూ.5 లక్షలను మంజూరు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి సుధాకర్ కుటుంబానికి ఏ రకమైన సాయమూ అందలేదు. పాలకుల నుంచి కనీసం పరామర్శ కూడా దక్కలేదు. పిట్టల సుధాకర్ సంవత్సరీకం దగ్గరికి వస్తున్నా ఇప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఏలాంటి సహకారాలు అందించలేదు. సుధాకర్ భార్య విజయ, వృద్ధాప్యంలో ఉన్న తల్లి వెంకటమ్మ కూలీ పనులకు పోతూ జీవన పోరాటం చేస్తున్నారు. ఇప్పుడు ఇద్దరు కూలీ పనులు చేస్తున్నప్పటికి అప్పులకు మిత్తీ కట్టలేక పోతున్నారు. ప్రస్తుతం సుధాకర్ కుటుంబానికి తిండికీ ఇబ్బందులు ఉన్నాయి. సాగు కోసం అప్పుల బాధతో కుటుంబ యాజమానిని కోల్పోయి చచ్చిచెడీ బతుకీడుస్తున్న సుధాకర్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఏ ఒక్కరూ కనీసం ఓదార్చడానికి రాలేదు. విజయకు వితంతు ఫించను మంజూరు చేయలేదు. సుధాకర్ మరణంతో రైతు బీమా కోసం డెత్ సర్టిఫికెట్ మంజూరైంది. దీని ఆధారంగా రైతు బంధు(రైతు భరోసా) వర్తించకుండా పోయింది. భూమి సుధాకర్ నుంచి భార్య పేరు మీదికి మారితేనే రైతు భరోసా పథకం వర్తిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల అర కొరగా చేసిన పంట రుణాల మాఫీపైనా చాలా మంది రైతుల తరహాలోనే సుధాకర్ కుటుంబానికి స్పష్టత లేదు.

పింఛన్ రాలె: పిట్టల విజయ

అందరు వడ్లు, మక్కలు పండించుకుంటుర్రు. మనం గూడ మంచి పంటలు పండించుకుందామని మా ఆయన అప్పులు చేసి బాయి తవ్వించిండు. నీళ్లు పడకపోతే సైడుబోర్లు వేయించిండు. అప్పులు ఎక్కువైనయి. ఇంత లనే అప్పు చేసి నా బిడ్డకు పెండ్లి చేసినం. పాత అప్పులు కొత్త అప్పులు మూటలెక్కయ్యి కష్టంల పడ్డం. అప్పులోళ్ల లొల్లి ఎక్కువయ్యి బాయికాన్నే పురుగుల మందు తాగి చచ్చిపోయిండు. అప్పులోళ్లను ఆగపట్టుడు కట్టంగా ఉంది. ఏం చెయ్యాల్నో తెలుత్తలేదు. కేసీఆర్ సారు తీసుకచ్చిన రైతుబీమా కింద వచ్చిన ఐదు లచ్చలతోటి కొంచెం నిమ్మలపడ్డం. ఇప్పుడు మిగిలిన అప్పులు ఎట్ల గట్టాల్నో తెలుత్తలేదు. మేము ఇంత మందాగి సత్తే మంచి గుండు అనిపిత్తాంది.'

తిరుపతి ఫొటో వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

అప్పులే ఆగం చేసినయ్

- **మహారాజ్‌తండాలో రైతు తిరుపతి ఆత్మహత్య**
- **పదిరోజుల క్రితం బలవన్మరణం**
- **దుఃఖసాగరంలో బాధిత కుటుంబం**
- **పరామర్శించనున్న బీఆర్ఎస్ అధ్యయన కమిటీ**

సంగెం, జనవరి 29: పంటలు సరిగ్గా పండక, పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపంతో పది రోజుల క్రితం ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పులు ఆగం చేయడంతో ఇంటి పెద్దను కోల్పోయామని కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారు. వరంగల్ జిల్లా సంగెం మండలంలోని పోచమ్మతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మహారాజ్‌తండాలో ఈ నెల 19న రైతు బానోత్ తిరుపతి (39) ఆత్మహత్య చేసుకున్నాడు. తనకు ఉన్న రెండెకరాల వ్యవసాయ భూమితోపాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని మూడేండ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. ఏడెకరాల్లో మొదలు పత్తిపంట వేసి అది సరిగ్గా పండకపోవడంతో దాన్ని తీసేసి మక్కజొన్న వేశాడు. దానికి కూడా పెట్టుబడి ఎక్కువైంది. ఇలా మూడేండ్లు పంట సరిగ్గా దిగుబడి రాక పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చాలనే బాధతో దిగులు పడుతుండేవాడు. రోజూ ఇంట్లో తన కుటుంబ సభ్యులతో చెబుతూ రోదించేవాడు. మూడేండ్లుగా రూ.8 లక్షల వరకు అప్పులయ్యాయి. మిత్తితో కలిసి ఎక్కువ మొత్తంలో అప్పులు కాగా, వాటిని ఎలా తీర్చాలనే తెలియక కుంగిపోయాడు. ఈ నెల 18న ఇంటి వద్ద పురుగుల మందు తాగి తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. అక్కడ వాంతులు చేసుకుంటుండగా చుట్టుపక్కల రైతులు చూసి 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 19న మృతి చెందాడు. పదిరోజులుగా ఆ ఇంట్లో కన్నీటి వ్యథే కనబడుతున్నది. మృతుడికి తల్లిదండ్రులు బానోత్ కేవ్ల, పూరమ్మ, భార్య రజిత, కుమారులు హరీశ్ (పదోత రగతి), చిన్న కుమారుడు జశ్వంత్ (ఆరో తరగతి) ఉన్నారు. బానోత్ తిరుపతి గతంలో ఐదేండ్లపాటు పాలేరుగా పనిచేసి, రెండేండ్లు హమాలీగా పనిచేశాడు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న గిరిజన రైతు కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నది.

నేడు పల్లార్‌గూడకు బీఆర్ఎస్

- **రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ పర్యటన**
- **మహారాజ్‌తండాలో తిరుపతి కుటుంబానికి పరామర్శ**
- **ఆత్మహత్యకు కారణాలపై ఆరా**
- **హాజరుకానున్న మాజీ మంత్రి హరీశ్‌రావు**

సంగెం, జనవరి 29: రైతు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ అధ్యయన కమిటీ గురువారం వరంగల్ జిల్లా సంగెం మండలం పల్లార్‌గూడ గ్రామంలో పర్యటించనున్నది. పోచమ్మతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మహారాజ్‌తండాకు చెందిన రైతు బానోత్ తిరుపతి అప్పుల బాధతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. రైతు ఆత్మహత్యల బీఆర్ఎస్ అధ్యయన కమిటీ సభ్యులు గురువారం సదరు రైతు కుటుంబాన్ని పరామర్శించనున్నారు. ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు?, కుటుంబ పరిస్థితులు ఎలా ఉన్నాయి? తదితర విషయాలను తెలుసుకోనున్నారు. అనంతరం గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించనున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, కమిటీ చైర్మన్, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి,తోపాటు సభ్యులు పాల్గొననున్నారు.

సచివాలయానికి దూరంగా సీఎం

- **వాస్తు మార్పులు పూర్తయినా ముఖం చాటేస్తున్న ముఖ్యమంత్రి**
- **జూబ్లీహిల్స్ నివాసానికే మంత్రులు, అధికారులు**
- **కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచే అధికారిక సమీక్షలు**

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పాలన 'అయితే జూబ్లీహిల్స్ నివాసం.. లేదంటే పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్' కేంద్రంగా సాగుతున్నది. ముఖ్యమైన సమీక్షలు, ప్రధానమైన నిర్ణయాలన్నీ అక్కడి నుంచే జరిగిపోతున్నాయి. మంత్రులు, అధికారులాంతా జూబ్లీహిల్స్ వైపు పరుగులు తీయాల్సి వస్తున్నది. 'సచివాలయానికి రోజూ వెళ్తున్నా.. ఎంతమంది వస్తే అంతమందిని కలుస్తున్నా. ప్రతి ఒక్కరిని కలిసిన తర్వాతే ఇంటికి వెళ్తున్నా' అని సీఎం రేవంత్‌రెడ్డి పదే పదే చెప్తున్నా వాస్తవంలో మాత్రం ప్రజాపాలన సచివాలయానికి దూరంగా సాగుతున్న దన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తనను కలవాలని వచ్చేవారికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖం చాటేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. పోలీసు పహారా మధ్య గ్రామసభలు.. అదే పోలీసుల కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రభుత్వ నిర్ణయాలు ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

గతంలో రేవంత్ విమర్శలు

గతంలో కొత్త సచివాల నిర్మాణం కోసం పాత సచివాలయాన్ని కూల్చిన తర్వాత నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్యమైన సమీక్షలన్నీ సీఎం క్యాంప్ ఆఫీసులో నిర్వహించేవారు. బీఆర్‌కే భవన్‌లో సచివాలయం కొనసాగినా అందులో సీఎం సమీక్షలు నిర్వహించే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో క్యాంప్ ఆఫీస్‌లో సమీక్షలు చేసేవారు. అప్పుడప్పుడు తన ఎర్రవెల్లిలోని నివాసానికి పిలిపించుకునేవారు. దీనిపై నాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేసేవారు. కానీ వందల మందితో సమీక్షలు నిర్వహించగలిగే స్థాయిలో సచివాలయంలో వసతులున్నా ఇప్పుడు సీఎం మాత్రం జూబ్లీహిల్స్‌లోని తన ఇంటి నుంచి లేదా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచే అంతా నడుపుతున్నారు. దీంతో రేవంత్ రెడ్డిది 'ప్యాలెస్ నుంచి పాలన' అని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

వాస్తు మార్పులు పూర్తయినా..

అధికారంలోకి వచ్చిన కొత్తలో సీఎం రేవంత్‌రెడ్డి రోజూ సచివాలయానికి వచ్చేవారు. కొన్నాళ్ల తర్వాత సచివాలయానికి రావడం తగ్గించారు. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికల తర్వాత సచివాలయానికి దూరంగా ఉంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుకున్న ఫలితాలు రాకపోవడం, పాలనా వైఫల్యాల నేపథ్యంలో సచివాలయం వాస్తు మార్పులపై దృష్టి పెట్టారు. మొదట్లో సచివాలయంలోని ఆరో అంతస్తులో ఉన్న సీఎం కార్యాలయంలో వాస్తు మార్పులు చేశారని వార్తలు వచ్చాయి. తన చాంబర్‌ను ఆరో అంతస్తు నుంచి 9వ అంతస్తులోకి మార్చేందుకు సీఎం ప్రయత్నించారని సచివాలయ వర్గాల్లో చర్చ జరిగింది. సచివాలయంలోకి వచ్చేందుకు వెనుక వైపు ఉన్న మార్గాన్ని ఉపయోగించడం మొదలుపెట్టారు. అయినా మార్పు కనిపించకపోవడంతో సీఎం సచివాలయానికి రావడానికే ఆసక్తి చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. చివరి ప్రయత్నంగా సచివాలయం ముందు ప్రధాన ద్వారాన్ని మూసేశారు. కొత్త ద్వారాన్ని నిర్మించారు. దీంతోపాటు సచివాలయం ముందు భాగంలో కొత్తగా రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో ఇక వాస్తు మార్పులన్నీ పూర్తయ్యాయని సీఎం తరచూ సచివాలయానికి వస్తారని అంతా భావించారు . కానీ సీఎం వ్యవహార శైలి మారలేదని, ఇప్పుడు పాలన అంతా కమాండ్ కంట్రోల్ సెంటర్ లేదా జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం నుంచే నడుస్తున్నదని విమర్శిస్తున్నారు.

పని ఒత్తిడితో ఏఈఈ ఆత్మహత్య

సాయిచరణ్ (ఫైల్)

డిచ్‌పల్లి, జనవరి 29: విధి నిర్వహణలో తీవ్ర ఒత్తిడికి లోనై మానసికంగా కృంగిపోయిన నీటిపారుదల శాఖ ఉద్యోగి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం నడిపల్లి శివారులో చోటు చేసుకున్నది. డిచ్‌పల్లి ఎస్సై షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన కత్తులపురం సాయిచరణ్(30) ధర్పల్లిలో ఏఈఈగా విధులు నిర్వహిస్తున్నాడు. పనిచేసే చోట తీవ్ర ఒత్తిడికి లోనై ఈ నెల 28న డిచ్‌పల్లి శివారులో పురుగులమందు తాగాడు. వెంటనే హైదరాబాద్ యశోద దవాఖానకు తరలించగా బుధవారం మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రభుత్వ నిర్ణయాలు

- **మాజీ మంత్రి హరీశ్‌రావు**

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): 'అయితే జూబ్లీహిల్స్ ప్యాలెస్ నుంచి, లేదంటే కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పాలన సాగుతున్నది. ఇదీ కాంగ్రెస్ మార్క్ ప్రజాపాలన' అని మాజీ మంత్రి హరీశ్‌రావు దుయ్యబట్టారు. పోలీసు పహారా మధ్య గ్రామసభలు.. పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రభుత్వ నిర్ణయాలా? అని ఆయన మండిపడ్డారు. 'ప్రజాపాలన అంటివి, సీఎం క్యాంపు ఆఫీసులో ప్రజా దర్బార్ అంటివి. ప్రతిరోజూ ప్రజలను కలుస్త అంటివి. ఏడాది కాలంగా ముఖం చాటేస్తివి' అని ఎద్దేవా చేశారు. సీఎం, మంత్రుల పేషీలు, అన్ని శాఖలు, విభాగాలు ఒకే దగ్గర ఉండేలా, సచివాలయం ఉండగా.. దాన్ని కాదని మంత్రులు, అధికారులను రేవంత్ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌కు, కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు పరుగులు పెట్టిస్తున్నారని విమర్శించారు. సీఎం అధికారిక నివాసం రేవంత్ దర్పానికి సరిపోదని ఆరోపించారు. ఇందిరమ్మ రాజ్యమంటే ఇదేనా? అని ప్రశ్నించారు.

సేవాలాల్ జయంతి నిర్వహించాలి

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించాలని గిరిజన విద్యార్థి సంఘం జాతీయ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని తలపెట్టింది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజునాయక్, ఇందల్ రాథోడ్, వెంకట్ బంజారా, రమేశ్‌నాయక్, రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోటిబండతండాలో సమావేశాన్ని ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

లగచర్ల రైతుపై మళ్లీ పిడుగు!

మొదటిపేజీ తరువాయి...

పోలేపల్లి, లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంట తండాల పరిధిలో ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేయనున్న ప్రభుత్వం.. అందుకు అవసరమైన భూసేకరణ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నది. ముందుగా అసైన్డ్ భూములను సేకరించనున్నట్లు ప్రభుత్వం చెప్తున్నప్పటికీ.. భూములివ్వని రైతులపైనే ప్రధానంగా దృష్టిసారించినట్లు చెప్తున్నారు. ఈ నెల 31 నుంచి అసైన్డ్ భూముల సర్వే పనులు చేపడ్తామని దుద్యాల తహసీల్దార్ కిషన్ చెప్తున్నారు. ఈ మేరకు బుధవారం లగచర్ల, రోటిబండతండాలో ఆయన అధికారులతో సమావేశమయ్యారు. లగచర్లకు చెందిన 102 సర్వే నంబర్‌లో 43 మంది రైతులకు సంబంధించి 47.25 ఎకరాలు, రోటిబండత తండాలో అదే 102 సర్వే నంబర్‌లో 30 మంది రైతులకు చెందిన 22 ఎకరాలు, పులిచెర్లకుంట తండాలో 117. 120,121 సర్వే నంబర్లలోని 20 మంది రైతులకు చెందిన 40.15 గుంటలకు సంబంధించి భూసర్వే కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. లగచర్ల, రోటిబండతండా, పులిచెర్లకుంట తండాలో మొత్తంగా 110 ఎకరాల అసైన్డ్ భూములకు సర్వే చేపట్టి ఆయా రైతులకు సంబంధించి హద్దులను గుర్తించనున్నట్లు తెలిపారు. తహసీల్దార్‌తోపాటు డీటీ వీరేశ్ బాబు, ఆర్ఐ నవీన్ పాల్గొన్న ఈ సమావేశాల్లో రైతుల కన్నా పోలీసులే ఎక్కువగా ఉండటం గమనార్హం. నిన్నటిదాక ఫార్మా!.. ఇప్పుడు పారిశ్రామిక క్లస్టర్!.. ప్రభుత్వం తమను ఎందుకిలా వేధిస్తున్నదని దుద్యాల మండల రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తమ భూముల జోలికి రావొద్దని వేడుకుంటున్నారు. తాము పోరాడి అలసిపోయామని, అయినా ప్రభుత్వం పదే పదే తమను వేధిస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు.

దళితబంధు నిధులకు మోక్షం

- **ఎట్టకేలకు ఫ్రీజింగ్ తొలగించిన సర్కార్**
- **10,408 మందికి 334.63 కోట్లు విడుదల**
- **కలెక్టర్లకు ఎస్సీ కార్పొరేషన్ ఎండీ ఆదేశాలు**
- **ఏడాదిగా బ్యాంకుల్లోనే మూలుగుతున్న నిధులు**
- **బహుళ యూనిట్ల లబ్ధిదారుల నిరీక్షణకు తెర**
- **ఫలించిన బీఆర్ఎస్ పోరాటం.. లబ్ధిదారుల్లో హర్షం**

ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం దిగిరావడంతో దళితబంధు నిధులకు మోక్షం కలిగింది. లబ్ధిదారుల ఖాతాల ఫ్రీజింగ్‌ను సర్కార్ ఎత్తివేసింది. లబ్ధిదారులు, వారి తరపున బీఆర్ఎస్ పోరాటానికి ఫలితం దక్కింది. రెండోవిడత దళితబంధు నిధులపై విధించిన ఫ్రీజింగ్‌ను ఎత్తివేయడంతో దళిత కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 10,408 మంది దళిత కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నది. ఈ మేరకు రూ.334.63 కోట్ల నిధులను లబ్ధిదారులకు విడుదల చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఎండీ నుంచి ఆదేశాలు వెళ్లాయి.

కరీంనగర్ జిల్లా జమ్మికుంట తెలంగాణ చౌక్‌లో దళితబంధు లబ్ధిదారుల సంబురాలు

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ)/కరీంనగర్/హుజూరాబాద్ టౌన్: దళితుల బతుకుల్లో వెలుగులు చూడాలన్న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్షలకు అనుగుణంగా దళితబంధు పథకం రూపుదిద్దుకున్నది. దళితుల అభ్యున్నతికి, ఆర్థిక ప్రగతిని సాధించేందుకు కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని తీసుకురావాలని సంకల్పించింది. 2021లో వాసాలమర్రి గ్రామంలో ప్రారంభమైన ఈ పథకం ఆ తర్వాత కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గాన్ని తొలుత పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఆ నియోజకవర్గంలో 18,021 మంది లబ్ధిదారులను గుర్తించి ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున నిధులను మంజూరు చేశారు. ఇందులో రూ.10 వేలు దళిత సంక్షేమ నిధికి జమ చేయగా, మిగతా రూ.9.90 లక్షలను లబ్ధిదారులైన దళితుల ఖాతాల్లో జమచేశారు. వీటితో దళితులు తమ ఇష్టమైన వ్యాపారం చేసుకోవడం, అద్దె, ఇతర వాహనాలు కొనుగోలు చేసుకొని తమ జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకున్నారు. ఎంపికైన లబ్ధిదారుల్లో 9,873 మందికి ఆర్థికసాయం అందించారు. మిగతా లబ్ధిదారులు ఎంచుకున్న యూనిట్లను బట్టి 50 నుంచి 80 ఆపై శాతం ఆర్థిక సాయాన్ని అందించారు. అంతలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఎన్నికల కమిషన్ ఈ పథకానికి బ్రేక్ వేసింది.

రెండో విడత రాష్ట్రవ్యాప్తంగా అమలు

రెండో విడత రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా దళిత బంధు పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసింది. మొదటి, రెండో విడత కలిపి మొత్తంగా 44 వేల మందికిపైగా ఈ పథకం ద్వారా లబ్ధిపొందారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రూ.4,400 కోట్లను లబ్ధిదారుల ఖాతాలకు నిధులను విడుదల చేసింది. తొలుత యాదాద్రి జిల్లా వాసాలమర్రి గ్రామంలో మొదలుపెట్టి హుజూరాబాద్ నియోజకవర్గంలోని దళితులందరికీ, ఆపైన కామారెడ్డి జిల్లా నిజాంసాగర్, ఖమ్మం జిల్లా చింతకాని, నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండ, సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలాల్లోని దళితులందరికీ పథకాన్ని వర్తింపజేసింది. ఆ తర్వాత హుజూరాబాద్‌ను మినహాయించి మిగతా 118 నియోజకవర్గాల్లో 1,500 చొప్పున మొత్తంగా 17,700 కుటుంబాలకు దళితబంధు పథకాన్ని వర్తింపజేసి ఆర్థిక సాయాన్ని అందజేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పథకాన్ని నిలిపివేసింది. కాంగ్రెస్ పాలనలో దళితబంధు నిధులను ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చింది. దీంతో లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. ఏడాదిగా బీఆర్ఎస్, లబ్ధిదారులు పోరాటాలు చేస్తూ వచ్చారు. దీంతో దిగొచ్చిన సర్కారు ఎట్టకేలకు నిధులను విడుదల చేస్తూ ఆదేశాలను జారీ చేసింది.

334.63 కోట్ల విడుదలకు ఆదేశాలు

రాష్ట్రవ్యాప్తంగా 10,408 మంది దళిత బంధు లబ్ధిదారులకు సంబంధించి రూ.334.63 కోట్ల పెండింగ్ నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు ఎస్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ క్షితిజ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. దళితుల అభ్యున్నతికి, ఆర్థిక ప్రగతిని సాధించేందుకు కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకానికి శ్రీకారం చుట్టగా, దళితబంధు లబ్ధిదారులు, బీఆర్ఎస్ పార్టీ అవిశ్రాంత పోరాటంతో ఎట్టకేలకు ఈనాటి ప్రభుత్వం దిగివచ్చింది.

ఏడాదిగా బ్యాంకుల్లోనే నిధులు

దళితబంధు పథకం కింద గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.10 లక్షల ఆర్థికసాయాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమజేసింది. అందులో చాలామంది లబ్ధిదారులు ఒకటికి మించి యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని భావించారు. ఈ క్రమంలో తొలుత బ్యాంకులోని కొంత మొత్తం నిధులతో ఒక యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. తదుపరి మిగిలిన నిధులతో మరొక యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవాలని ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. అయితే ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దళితబంధు లబ్ధిదారులకు సంబంధించి బ్యాంకుల్లో నిల్వ ఉన్న నిధులను విడుదల చేయకుండా ఆదేశాలను జారీ చేసింది. దీంతో మొదటి విడతలో ఎంపికైన 9,937 మందికి సంబంధించి రూ.324.75 కోట్లు, రెండవ విడతలో ఎంపికైన 471 మంది లబ్ధిదారులకు సంబంధించి 9.88 కోట్లు బ్యాంకుల్లోనే ఉండిపోయాయి. మొత్తంగా 10,408 మందికి రూ.334.63 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం బ్యాంకు ఖాతాల్లోనే ఉండిపోయిన ఆ నిధులను సదరు లబ్ధిదారులకు విడుదల చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఎస్సీ కార్పొరేషన్ ఎండీ క్షితిజ ఆదేశాలను జారీచేశారు.

ఫలించిన బీఆర్ఎస్ పోరాటం

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితబంధు నిధుల విడుదల చేయకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నది. ఏడాదిగా కాలయాపన చేస్తున్నది. ఈ నేపథ్యంలోనే లబ్ధిదారులు దళితబంధు సాధన సమితి పేరిట రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నారు. సమితికి బీఆర్ఎస్ నాయకులు బాసటగా నిలిచారు. ప్రభుత్వంపై ఏడాదిగా అవిశ్రాంతంగా పోరాడుతూ వస్తున్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఆందోళనకు దిగిన స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపైనా ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. దళితబంధు నిధులను సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్నివిధాలా ఒత్తిడి చేస్తూ వచ్చారు. దీంతో ఎట్టకేలకు దిగివచ్చిన ప్రభుత్వం తాజాగా బ్యాంకుల్లోని నిధులను లబ్ధిదారులకు విడుదల చేయాలని నిర్ణయించింది.

దళితబంధును అమలు చేయాల్సిందే

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

దళితబంధును పూర్తిగా అమలు చేయాల్సిందేనని హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితబంధు రెండోవిడత నిధుల విడుదలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై ఆయన ఓ వీడియో సందేశంలో హర్షం వ్యక్తంచేశారు. దళితుల ఆర్థికస్థితిని మెరుగుపర్చాలని, వారి జీవితాల్లో ఆర్థిక స్వావలంబన తీసుకురావాలని భావించిన కేసీఆర్ నాడు దళితబంధు పథకాన్ని అమలు చేశారని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను సాకారం చేయడమే లక్ష్యంగా, దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రతి దళిత కుటుంబానికి అందించేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని గు